
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 19 ఆగస్టు 2024


భళారే విచిత్రం

మాటలకందని భావాల రూపం చిత్రం
అది మధుర, మనోహర జ్ఞాపకాల భాండాగారం
చేదు నిజాలకు సజీవ సాక్ష్యం
'చిత్ర'మైన మనసుకు తుళ్లింతలు వేసే తోరణం
ఆకలి కేకలతో కొమ్మరెమ్మలపై కాయల కోసం
వెదికే ఉడత ఆరాటాన్ని హృద్యంగా బంధిస్తూ..
వానర చర్చలకు భాష్యం చెబుతూ
పక్షుల ఊసులకు వివరాలు అందిస్తూ..
ఉషోదయ వేళ ప్రకృతి
అందాలను చూపే అద్భుతం ఫొటో..
నేడు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం



తాపసులు మెచ్చే ఉషస్సు

అరుణోదయ వేళ అవని జలనిధిపై
ఆదిత్యుని ప్రతిబింబ చుంబనం
అక్షరాలకందని అద్భుత భావం





విహంగ వీక్షణం

రెక్కలు తొడిగి రెపరెపలాడుతూ
ఆకాశవీధిలో ఎగిరే ఓ బకములారా..!
వైనతేయుడు విగ్రహమై
నిగ్రహంగా ఉన్నాడు.. లేకుంటేనా...

పెళ్లి గురించేనా చర్చ!



మర్కటాల మదిలో ఏముందో
సకుటుంబ సపరివార సమేతంగా
సమావేశమయ్యి చర్చిస్తున్నాయి
శ్రావణ మాసం కదా పెళ్లి గురించేనేమో?



దిష్టి తగులుతుందేమో!

ఏయ్..! ఇప్పుడే గింజలు తిన్నా
గొంతులో అడ్డంపడ్డాయి..
అందుకే నీళ్ల తాగుతున్నా
ఫొటో తీయొద్దు బాబు... దిష్టి తగులుతుంది

ఉడతా ఉడతా ఊచ్!



హాయ్ రే హాయ్
నాకో పండు
దొరికిందిరోయ్
నా మజాకు
అడ్డురాకురోయ్

కుర్చీ కోసం..

మునిసిపాలిటీపై టీడీపీ గురి

తొమ్మిది మంది వైసీపీ కౌన్సిలర్లకు గాలం

తెలుగుదేశంలో చేరికకు రంగం సిద్ధం

నేడే ముహూర్తం?



గుంతకల్లు మునిసిపల్ కార్యాలయం



టీడీపీలోకి తొమ్మిది మంది

అధికార తెలుగుదేశం పార్టీ గుంతకల్లు మునిసిపాలిటీని చేజిక్కించుకునేందుకు కసరత్తు ప్రారంభించింది. వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ వైపు ఆకర్షితులవుతున్నా.. ఇన్నాళ్లూ పెద్దగా ఆసక్తి చూపలేదు. మునిసిపాలిటీలో అనుకూల నిర్ణయాలు తీసుకోవడానికి కౌన్సిల్‌లో మెజారిటీ లేకపోవడంతో భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా ఉండటం కోసం ప్రస్తుత పాలకవర్గానికి నాలుగేళ్లు పూర్తయ్యాక చైర్మన్ పదవిని చేజిక్కించుకునేందుకు వీలుగా వైసీపీ కౌన్సిలర్లను పార్టీలో చేర్చుకోవాలని టీడీపీ శిబిరం యోచిస్తోంది. మాసాంతపు మునిసిపల్ సమావేశంలో స్టాండింగ్ కౌన్సిల్ పదవీ నియామకం చేపట్టనున్నందున అంతలోపు కౌన్సిల్‌లో మెజారిటీని సాధించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ కారణంగా వైసీపీ కౌన్సిలర్లను తమ శిబిరంలో కలుపుకునేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

- గుంతకల్లు

సార్వత్రిక ఎన్నికలకు ముందే వైసీపీ నుంచి నలుగురు కౌన్సిలర్లు టీడీపీలోకి చేరారు. ఎన్నికలు పూర్తయి టీడీపీ భారీ విజయాన్ని సాధించడంతో వైసీపీ కౌన్సిలర్లు ఆ పార్టీలో ఉంటే వార్డుల అభివృద్ధి నిలిచిపోతుందేమోనన్న అనుమానంతో అధికారపార్టీలో చేరడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను కలిసిన వైసీపీ కౌన్సిలర్లు ఆయనకు సన్మానాలు చేశారు. ఈక్రమంలోనే పార్టీలోకి చేరే విషయం చర్చించారు. టీడీపీలో వ్యతిరేకత రావడంతో వారిని పార్టీలోకి చేర్చుకునే విషయంలో వేచిచూసే ధోరణిని కనబరిచారు. మునిసిపాలిటీ సమావేశాల్లో సానుకూల నిర్ణయాలు తీసుకోవడానికి కౌన్సిల్‌లో తగినంత బలం లేకపోవ డం అధికార పార్టీకి సమస్యగా మారింది. దీంతో కౌన్సిల్‌లో తగినంత బలాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. వైసీపీకి చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లను టీడీపీలో చేర్చుకునేందుకు రంగం సిద్ధం చేశారు. టీడీపీకి ఏడుగురు కౌన్సిలర్లు ఉండగా, ఎన్నికల సమయంలో నలుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలోకి చేరడంతో సంఖ్యా బలం 11కు పెరిగింది. ప్రస్తుతం తొమ్మిది మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. వారు కూడా చేరితే కౌన్సిల్‌లో టీడీపీ బలం 20కి పెరగనుంది. స్థానిక ఎమ్మెల్యే గుంతకల్లులోనే ఎక్స్‌-అఫిషియో సభ్యత్వాన్ని కలిగి ఉండటంతో సంఖ్యా బలం 21కి పెరుగు తుంది. వచ్చే ఫిబ్రవరి కల్లా మూడింట రెండొంతుల బలాన్ని కూడగట్టుకుని చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

స్టాండింగ్ కౌన్సిల్ చుట్టూ రాజకీయం

మునిసిపాలిటీకి న్యాయ సలహాలు ఇచ్చే స్టాండింగ్ కౌన్సిల్ పదవి చుట్టూ ప్రస్తుతం రాజకీయం నడుస్తోంది. వైసీపీ పాలనలో స్టాండింగ్ కౌన్సిల్ పదవిలో న్యాయవాది తిమ్మారెడ్డి నియమితులయ్యారు. ప్రభుత్వం మారడంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ప్రస్తుతం స్టాండింగ్ కౌన్సిల్ పదవిని భర్తీ చేసే విషయంగా మునిసిపాలిటీ దరఖాస్తులను ఆహ్వానించింది. ఎమ్మెల్యే జయరాం సిఫారసుతో టీడీపీ నాయకుడైన న్యాయవాది బీఎస్ కృష్ణారెడ్డి దరఖాస్తు చేశారు. ఆయనకు పోటీగా గోపాల కృష్ణ అనే న్యాయవాదిని వైసీపీ రంగంలోకి దింపింది. వీరిద్దరూ కాకుండా మరో ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కౌన్సిల్‌లో టీడీపీకి సంఖ్యా బలం అవసరం ఏర్పడింది. దీంతో వైసీపీ కౌన్సిలర్లను పార్టీలోకి తీసుకోవడానికి టీడీపీ గేట్లను తెరచింది. ఈ విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి వైసీపీ కౌన్సిలర్లను పిలిపించి పార్టీ వీడవద్దంటూ అనునయించినట్లు సమాచారం. వైసీపీ కౌన్సిలర్లు సోమవారం టీడీపీలో చేరనున్నట్లు తెలిసింది. ఇదే జరిగితే కౌన్సిల్‌లో వైసీపీ బలహీన పడనుంది.

మొదలైన ఉత్కంఠ

ప్రభుత్వ ఉద్యోగుల్లో బదిలీ గుబులు



జిల్లా పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయం


పీఆర్, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్ ఉద్యోగుల్లో ఆందోళన

కోరుకున్న స్థానం కోసం ఎవరికి వారు ప్రయత్నాలు



జిల్లా హౌసింగ్ కార్యాలయం

అనంతపురం సిటీ, ఆగస్టు 18: ప్రభుత్వం బదిలీల ఉత్తర్వులు జారీ చేయడంతో ఉద్యోగుల్లో ఉత్కంఠ మొదలైంది. ఒకే చోట ఐదేళ్లు పని చేసిన ప్రతి ఒక్కరూ బదిలీ కావాల్సిందే అనే నిబంధనతో పాటు అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ కింద ఎవరినైనా బదిలీ చేసే అవకాశం ఉందని మార్గదర్శకాల్లో పేర్కొనడం ఆయా ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రధానంగా జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్ శాఖల్లోని ప్రభుత్వ ఉద్యోగుల్లో బదిలీల గుబులు మొదలైంది. ఈక్రమంలోనే కొందరు తమకు నచ్చిన స్థానాల కోసం తమదైన శైలిలో ప్రయత్నాలు ప్రారంభించారు.



పీఆర్, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్ ఉద్యోగుల్లో గుబులు

ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రధానంగా జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్ శాఖల్లోని ఇంజనీరింగ్ అధికారుల్లో (ఈఈ, డీఈఈ, ఏఈ, జేఈలు తదితర సిబ్బంది) ఆందోళన మొదలైంది. పైగా ఆయా శాఖల్లో ఈఈ, డీఈఈ, జేఈ, ఏఈల పోస్టులు ఎక్కువ శాతం ఖాళీగా ఉండటం, లేకుంటే కింది స్థాయి ఉద్యోగులకు డీఈఈలుగా బాధ్యతలు అప్పగించడం వంటి ప్రక్రియ ఇప్పటికే ఆశాఖల్లో నెలకొంది. ఈ క్రమంలో బదిలీ ఉత్తర్వులు రావడంతో ఆయా స్థానాలకు రెగ్యులర్ ఉద్యోగులు వస్తారా..? లేక యథావిధిగా బదిలీల్లోనూ కింది స్థాయి ఉద్యోగులకే ఇన్‌చార్జిల బాధ్యత అప్పగిస్తూ బదిలీలు చేస్తారా? అనే చర్చ సాగుతోంది.

ఉద్యోగుల్లో ఆసక్తి

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు గడిచినా ఉద్యోగుల బదిలీలకు శ్రీకారం చుట్టకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు బదిలీల కోసం ఉత్కంఠగా ఎదురుచూశారు. కొందరైతే వేచి ఉండలేక తమదైన శైలిలో బదిలీ చేయించుకున్నారు. మిగిలిన వారు నిరాశగా ఎదురుచూస్తుండిపోయారు. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం బదిలీల ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయా శాఖల ఉద్యోగుల్లో తమకు ఎలాంటి స్థానం దక్కుతుందోననే ఆసక్తి నెలకొంది. త్వరలోనే తమకు బదిలీ రానుందనే విషయంలో ఉద్యోగులకు స్పష్టత వచ్చింది.

నెలాఖరుకు తెర

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ఉత్కంఠకు ఈనెలాఖరుకు తెరపడనున్నట్లు ఆయా వర్గాల సమచారం. బదిలీ ఉత్తర్వుల ప్రకారం ఆయా శాఖల్లో ఐదేళ్ల ఒకేచోట పనిచేసిన ఉద్యోగుల వివరాలన్నీ కూడా వచ్చే 15 రోజుల్లో (ఈనెల 31) ఆయా శాఖల ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వానికి సమగ్రంగా నివేదించనున్నారు. అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ కింద ఎవరెవరూ అవసరమో వారి వివరాలను కూడా నెలాఖరుకు అందజేయనున్నారు. అన్నీ సక్రమంగా జరిగితే వచ్చే నెల మొదటి వారంలో బదిలీల ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశం ఉందని ఆయా శాఖల ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి.



నేడు నూతన జేసీ బాధ్యతల స్వీకరణ

అనంతపురం టౌన్, ఆగస్టు 18: జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన శివనారాయణశర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో ఈ స్థానంలో పని చేసిన కేతన్‌గార్గ్ బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో నంద్యాల సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న శివనారాయణశర్మను అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాలో అండర్‌పాస్‌ల ఏర్పాటుకు

చొరవ చూపండి

కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ అంబికా లేఖ

అనంతపురం, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాహనాల అండర్‌పాసులను ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ లేఖ రాశారు. ఆ లేఖను ఆయన ఆదివారం ఫ్యాక్స్ ద్వారా కేంద్ర మంత్రికి పంపారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ గత రెండ్రోజులుగా అనంతపురం నగరంలోని పలు ప్రాంతాలను జాతీయ రహదారుల అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రమాదాల నివారణలో భాగంగా వాహనాల అండర్‌పాస్‌లు అవసరమని భావించిన ఎంపీ.. కేంద్ర మంత్రికి ఆ వివరాలను లేఖ ద్వారా విన్నవించారు. ప్రమాదాల నేపథ్యంలో.. ప్రజాభద్రతే కాకుండా ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ఆయా ప్రాంతాల్లో వాహనాల అండర్‌పాస్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీ ఆ లేఖలో కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. పాదచారుల భద్రతను మెరుగుపరచడంతో పాటు... ప్రమాదాలు, మరణాలు తగ్గించడం, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతోపాటు స్థానికుల సౌకర్యం మెరుగు పరిచేందుకు చొరవ తీసుకోవాలని అందులో కోరారు. జిల్లాలో 12 ప్రాంతా ల్లో అండర్‌పాస్‌ల ఏర్పాటు అత్యవసరమని ఎంపీ కోరారు. జాతీయ రహదారి 544డిలో తాడిపత్రి రహదారిలో గుజరాంపల్లి క్రాస్, నీలూరు తహసీల్దార్ కార్యాలయం, పామిడి పెన్నావంతెన, ఇల్లూరు, తరిమెల క్రాస్, వడియంపేట, తపోవనం జంక్షన్, కక్కలపల్లి క్రాస్, ప్రసన్నాయపల్లి క్రాస్, రాప్తాడు జంక్షన్, రామినేపల్లి క్రాస్, జాతీయ రహదారి 42 తిరుపతి హైవేని కలిపే హంపాపురం, మరూరు క్రాస్ రోడ్ల వద్ద వాహనాల అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు.

కుప్పకూలిన ఆశ



శనివారం సాయంత్రం కాయలతో కళకళలాడుతున్న బీరతోట



ఆదివారం తెల్లవారుజామున నేలకూలిన బీరపంటను చూపుతున్న రైతు

నేలకొరిగిన బీరపంట..

రూ. ఆరులక్షలు నష్టం

కళ్యాణదుర్గం, ఆగస్టు 18: సాయంత్రం వరకూ కళకళాడి రైతుకు సంతోషం కలిగించిన ఆశల పంట తెల్లారే సరికి నేల కూలింది. కంటికి రెప్పలా కాపాడుకున్న పంట కాపు కాస్తున్న వేళ వర్ష బీభత్సానికి నేలమట్టమైంది. మండలంలోని ముదినాయనపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి రైతు నారాయణప్పకు చెందిన మూడెకరాల బీరతోట నేలమట్టమైంది. పంట కోత దశలో వున్న సమయంలో వర్షంధాటికి కుప్పకూలిపోయింది. దీంతో రూ. ఆరు లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం వరకూ పచ్చదనంతో కళకళలాడిన తోట రాత్రి గడిచేసరికి రైతుకు కన్నీటిని మిగిల్చింది. అప్పులు చేసి బీరపంట సాగు చేస్తే ఇలా వర్షం తన కష్టాన్ని ధ్వంసం చేసిందని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు.

అనుబంధానికి రక్ష.. రాఖీ

నేడు రాఖీ పౌర్ణమి వేడుకలు





రాఖీల కొనుగోలులో బిజీ

అనంతపురం కల్చరల్, ఆగస్టు 18: కులమతాలకు అతీతంగా సోదర సోదరీమణులు అపురూపంగా జరుపుకునే పండుగ రాఖీ పౌర్ణమి. జిల్లా వ్యాప్తంగా సోమవారం రాఖీ వేడుకలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. తమ సోదరులకు కట్టే రాఖీ కొనుగోలులో సోదరీమణులు నిమగ్నమయ్యారు. దుకాణదారులు అన్ని వర్గాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా రకరకాల రాఖీలను అందుబాటులోకి తెచ్చి విక్రయిస్తున్నారు రాఖీ పౌర్ణమి రోజు సోదరుడికి రాఖీ కట్టడంతో పాటు చేసే మరో ముఖ్యమైన పని మిఠాయి తినిపించడం. ఈనేపథ్యంలో పలు మిఠాయి దుకాణాలు ప్రత్యేక ఆఫర్లు, నూరూరించే రకరకాల మిఠాయిలతో ఆకర్షిస్తున్నాయి. కాగా ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ జరుపుకున్నారు.

కులమతాలకు అతీతమైన వేడుక

సమాజంలో కులమతాలకు అతీతంగా జరుపుకునే వేడుకే రాఖీ పండుగ. అందుకే అన్నివర్గాల వారికి భరోసా కల్పిస్తూ ప్రజాపిత బ్రహ్మకుమారీలంతా కలిసి రాఖీలు కట్టి ఆత్మీయతను పంచుకుంటున్నాం. ప్రపంచమంతా ఒకే కుటుంబం లాంటిదని మన పురాణాలు చెబుతున్నాయి. అందుకే రాఖీ పండుగను కేవలం భారతదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాం.

- శారద, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం

తిరుమలలో అన్నదానం అద్భుతం

మంత్రి పయ్యావుల కేశవ్



వెంగమాంబ అన్నదాన సత్రంలో భక్తులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం అర్బన్, ఆగస్టు 18: తిరుమలలోని శ్రీ వెంగమాంబ అన్నదాన సత్రంలో అన్నదానం అద్భుతమని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఆదివారం తిరుమలలోని శ్రీ వెంగమాంబ అన్నదాన సత్రాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ పరిశీలించారు. సామాన్య భక్తులతో కలిసి క్యూలైన్‌లో ఆయన సత్రంలోకి వెళ్లారు. అన్నదానం ఎలా జరుగుతోందని అక్కడి భక్తులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నాణ్యమైన భోజనాన్ని అందించడం జరుగుతోందన్నారు.

విధుల్లో చేరిన జీఆర్పీ ఎస్పీ



గుంతకల్లు, ఆగస్టు 18: రైల్వే పోలీసుశాఖ (జీఆర్పీ) ఎస్పీగా రాహుల్ మీనా ఆదివారం ఉదయం స్థానిక జీఆర్పీ గుంతకల్లు జిల్లా కార్యాలయానికి వచ్చి విధుల్లో చేరారు. ఏఎస్పీగా విధులను నిర్వర్తించిన మీనా పదోన్నతిపై జీర్పీ శాఖకు బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన ఆయన మాట్లాడుతూ నేరాలను అదుపు చేయడానికి కృషిచేస్తానన్నారు. రైల్వే డివిజన్‌లో అత్యంత సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టనున్నట్లు తెలియజేశారు. ఆర్పీఎఫ్, సివిల్ పోలీసు శాఖల సమన్వయంతో పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో జీఆర్పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, గుంతకల్లు జీఆర్పీ సీఐ నగేశ్‌బాబు, పోలీసు అధికారుల సంఘ నాయకుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కసాపురం ఆలయంలో పూజలు

జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనా ఆదివారం ఉదయం కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఎస్పీని ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించి స్వామివారి సన్నిధిలో నామార్చనలు చేశారు. స్వామివారి శాలువ వేసి, ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో జీఆర్పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఆలయ సూపరింటెండెంట్ పిడికిటి వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

కారులో వచ్చారు.. దర్జాగా చోరీ చేశారు..

హిందూపురంలో చోరీలు



చోరీ జరిగిన దుస్తుల దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

హిందూపురం, ఆగస్టు 18: దర్జాగా కారులో వచ్చారు... రెండు దుకాణాల్లో చోరీ చేసి వెళ్లిపోయారు. హిందూపురంలో శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు ఎక్స్‌యూవీ 500 కారులో వచ్చి డీఎల్‌రోడ్డులో రెక్కీ నిర్వహించారు. అదే రోడ్డు పక్కన పై అంతస్తులో ఉన్న శ్యామ్‌సంగ్ షోరూమ్ షెట్టర్ బలవంతంగా పైకెత్తి లోనికి ప్రవేశించినట్లు అక్కడి సీసీ కెమెరాలో రికార్డ్‌అయింది. ఆ సమయంలో వారు ముఖానికి మాస్కు, చేతులకు గ్లౌజులు ధరించారు. వేలిముద్రలు పడతాయని వారివెంట తెచ్చుకున్న ఆయిల్‌ను షట్టర్‌పై చల్లినట్లు తెలుస్తోంది. షాపులో నగదు లేకపోవడంతో వెనుతిరిగారు. అదేవిధంగా స్థానిక రైల్వేరోడ్డులో యుగంధర్‌కు చెందిన బట్టల దుకాణంలోనూ చోరీ జరిగింది. దుండగులు దుకాణం షట్టర్ తెరచి లోనికి వెళ్లారు. దుకాణంలో ఉన్న రూ.10వేలు నగదు, 20జతల దుస్తులను ఎత్తుకెళ్లారు. ఈ రెండు దుకాణాల్లో చోరీకి పాల్పడింది ఒకే గ్యాంగ్ అయి ఉండొచ్చు. స్థానికులు ఆదివారం ఉదయం గమనించి ఆయా దుకాణాల నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా చోరీ జరిగిన రెండు దుకాణాలనూ ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసులు సిబ్బందితో పరిశీలించారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 18: రియా ప్రైవేట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. శిబిరానికి వచ్చిన పేదలకు డాక్టర్లు ఉదయ్‌కుమార్, గీతా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, సీఈఓ మురళీకృష్ణ మాట్లాడుతూ బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలకు రూ.4వేల ఖర్చు అవుతుందని అయితే రూ.999లకే సదుపాయం కల్పించామని తెలిపారు. 18వ తేదీ వరకు నిర్వహించే ఉచిత శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నమ్మించి మోసం చేశాడు

- బాలికను గర్భవతి చేసిన ఘనుడు

హిందూపురం, ఆగస్టు 18: బాలికను నమ్మించి మోసం చేసి గర్భవతిని చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు హిందూపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన 16ఏళ్ల బాలికను రాజేష్(26) గత నాలుగేళ్లుగా పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భం వచ్చేలా చేశాడు. నాలుగు రోజుల క్రితం బాలిక అనారోగ్యం బారిన పడగా తల్లిదండ్రులు కర్ణాటకలోని గౌరీబిదనూరు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యులు ఐదు నెలల గర్భవతి అని చెప్పారు. చిక్కబళ్లాపురం జిల్లా సీడీపీఓ అధికారికి విషయం చేరవేయగా వారు ఆసుపత్రికి వచ్చి బాలికను తీసుకెళ్లారు. ఈ విషయాన్ని హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ కేసుతోపాటు పోక్సో కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉంటే బాలికను మోసం చేసిన యువకుడు ఇటీవల హత్యకేసులో నిందితుడిగా ఉన్నాడు. జైలులోనే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టమోటా మార్కెట్‌లో నయా దందా..!

లారీ అసోసియేషన్ మాటున పైసా వసూల్

మార్కెట్‌కు వచ్చివెళ్లే వాహనాల నుంచి వసూలు

పంచాయతీకి రూ.అరకోటికిపైగా నష్టం

అనంతపురంరూరల్, ఆగస్టు 18: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో నయా దందా సాగుతోంది. మార్కెట్‌కు వచ్చి వెళ్లే వాహనాల నుంచి అనధికారికంగా వసూళ్లు చేపట్టారు. లారీ అసోసియేషన్ మాటున పైసా వసూల్ వ్యవహారం సాగుతోంది. అయితే ఈ వ్యవహారం సాగిస్తున్నది మాత్రం మార్కెట్ అసోసియేషనేనన్న చర్చ ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది. రెండేళ్ల కిందట వరకు స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించి మార్కెట్‌కు వచ్చి వెళ్లే వాహనాల నుంచి సుంకం వసూలు చేసేవారు. ఈ విధానాన్ని తప్పుపడుతూ వాహనాల నుంచి సుంకం వసూలు చేయకూడదంటూ కోర్టు ఆదేశాలున్నాయంటూ నిలిపివేశారు. ప్రస్తుతం అదే సుంకాన్ని అసోసియేషన్ పేరిట వసూలు చేస్తుండటం ఆయా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పంచాయతీకి వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

అసోసియేషన్ మాటున వసూలు..

టమోటా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ వసూళ్ల పర్వం సాగుతున్నట్లు తెలుస్తోంది. అనంతపురం మిని లారీ అసోసియేషన్ పేరుతో వసూలు చేస్తున్నారు. ఈ విధంగా వసూలు చేయడాన్ని విరాళంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దేనికి విరాళమో..? సంబంధిత అసోసియేషన్ సభ్యులకే తెలియాలి. ఒక్కో వాహనం నుంచి ఒక్కో విధంగా వసూలు చేస్తున్నారు. బొలేరో, ఐచర్ వాహనాల నుంచి వంద చొప్పున, లారీల నుంచి రూ.200 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది. ఆపై వాహనాలకు రూ.2వేలు వసూలు చేస్తున్నట్లు చర్చసాగుతోంది. మార్కెట్ నుంచి ఎక్కువగా దూరప్రాంతాలకు టమోటా ఎగుమతి అవుతున్నాయి. వీటి ఎగుమతులు పెద్ద వాహనాలను ద్వారా సాగిస్తున్నారు. వీటి సంఖ్య రోజూ 50కిపై మాటే. అంటే వంద లారీలకు రూ.200 చొప్పున లెక్కవేసుకున్నా రూ.20వేలు, వంద బొలేరో, ఐచర్ వాహనాలకు రూ.100చొప్పున రూ.10వేలు, ఆపై వాహనాలకు ఒక్కొక్కదానికి రూ.2వేలు అంటే ఇలాంటి వాహనాలు రోజు 50పైనే వెళ్తున్నట్లు ఆయా వర్గాల సభ్యులే అంటున్నారు. ఈ లెక్కన రోజుకు రూ.లక్ష వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నెలకు రూ.30లక్షలు వసూలు చేస్తున్నట్లు ఆ వర్గాల సభ్యులు అంటున్నారు. ఈ సొమ్ము అంతా ఎవరికి వెళుతోంది? దేనికి వినియోగిస్తున్నారన్నది తెలియడం లేదని స్థానిక మార్కెట్‌లోని కొంత మంది గుసగుసలాడుకోవడం గమనార్హం. వాహనదారులు అసోసియేషన్‌కు డబ్బు చెల్లించారా లేదా అన్న విషయాలు తెలుసుకుని వివరాల నమోదుకు మార్కెట్ ప్రారంభంలో ఓ ఇద్దరు వ్యక్తులు ఉంటున్నారు. ఆ వ్యక్తులు కట్టె చేతపట్టి వాహనాలు నిలుపుతుంటారు. అసోసియేషన్‌కు సంబంధించిన రసీదు చూపిస్తే పంపుతారు. లేదంటే ఆ వాహనం నెంబరు ఓ బుక్కులో రాసుకుంటుండటం గమనార్హం.



మార్కెట్ ఎంట్రెన్స్‌లో వాహన వివరాలు తెలుసుకుంటున్న వ్యక్తి



మిని లారీ అసోసియేషన్ పేరిట విరాళం రూపంలో వాహనదారులకు ఇస్తున్న రసీదు

పంచాయతీకి రూ.అరకోటికిపైగా నష్టం..

ఇదిలా ఉండగా మార్కెట్‌కు వచ్చి వెళ్లే వాహనాల ద్వారా సుంకం వసూలుకు పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వేలం నిర్వహించేవారు. పంచాయతీ నిబంధనల ప్రకారం నాలుగు చక్రాల వాహనాలకు రూ.100, ఆరు చక్రాల వాహనాలకు రూ.250, పది చక్రాల వాహనాలకు రూ.300, 12చక్రాల వాహనాలకు రూ.350, 14చక్రాల వాహనాల నుంచి రూ.450 చొప్పున వసూలు చేసేవారు. ఏటా పంచాయతీకి రూ.40లక్షల నుంచి రూ.50లక్షల వరకు ఆదాయం సమకూరేది. ఆ సొమ్మును పంచాయతీ అభివృద్ధికి వినియోగించేవారు. రెండేళ్ల వరకు ఈ ప్రక్రియ సవ్యంగానే సాగేది. కోర్టు ఉత్తర్వుల పేరుతో వాహనాల అసోసియేషన్ సభ్యులు సుంకం వసూలు చేయకూడదని నిలిపివేయించారు. అయినా గ్రామ అవసరాల నిమిత్తమంటూ గత ఏడాది పంచాయతీ పరిధిలోని కొంత మంది గ్రామపెద్దలు వసూలు చేశారు. ఆ సొమ్ము ఎక్కడకుపోయింది..? ఎవరికీ తెలీయడం లేదని గ్రామస్థులు అంటున్నారు. ఈ ఏడాదీ అదే పరిస్థితి నెలకొంది. ఎవరైతే సుంకం వసూలు చేయకూడదని కోర్టు ఉత్తర్వులు చూపించి నిలిపివేశారో ఆ అసోసియేషన్ పేరుతో విరాళం మాటున వసూలు చేస్తుండటం ఆయా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒక వేళ నేటికీ సుంకం వసూలు జరిగి ఉంటే పంచాయతీ మరింత అభివృద్ధి జరిగేదని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ దిశగా ఆలోచించి పంచాయతీకి నిధులు సమకూరేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే కేపీఎల్ టోర్నీ

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

కళ్యాణదుర్గం, ఆగస్టు 18: యువతలో దాగి వున్న ప్రతిభను వెలికి తీయాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కేపీఎల్ పేరుతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత కొనియాడారు. ఆదివారం పట్టణంలోని కరణం చిక్కప్ప క్రీడా మైదానంలో కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు మంత్రితో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కాలవ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు, గుమ్మనూరు జయరామ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఆడుదాం ఆంధ్ర పేరుతో కోట్లాది రూపాయలను నొక్కేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కిందన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు కేపీఎల్ పేరుతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించాలనే ఆలోచన రావడం ఇక్కడి యువకుల అదృష్టం అన్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నాలుగు రోజుల పాటు టోర్నమెంట్ నిర్వహించడం ఆశామాషీ కాదన్నారు. అమిలినేని సేవలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అమిలినేని మాట్లాడుతూ నియోజకవర్గంలో యువకుల్లో మంచి ప్రతిభ వుందన్న ఉద్దేశంతోనే ఈ పోటీలు నిర్వహించామన్నారు. నాలుగు రోజుల పాటు 32 మ్యాచ్‌లను ఫ్లడ్ లైట్ల వెలుతురులో అర్థరాత్రి 12 గంటల వరకు కొనసాగించే విధంగా ఎంతో కష్టపడ్డామన్నారు. యువతకు చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమని ఆ విద్య, క్రీడలను అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. విజేతగా నిలిచిన కార్తీక్ కింగ్స్ టీమ్‌కు రూ.2 లక్షల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. అలాగే రన్నర్స్‌గా నిలిచిన గరుడ జ్ఞాన భారతి టీమ్‌కు రూ.లక్ష నగదుతో పాటు ట్రోఫీను అందజేశారు. మూడవ స్థానంలో నిలిచిన మీసేవా ఫైటర్స్‌కు రూ.50 వేలు నగదుతో పాటు ట్రోఫీను అందజేశారు. ఆర్డీవో రాణి సుష్మిత, ఎస్ఆర్సీ సిబ్బంది, క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.



కేపీఎల్ చాంపియన్ ట్రోఫీని మంత్రి సవిత చేతుల మీదుగా అందుకుంటున్న కార్తీక్ కింగ్స్ టీమ్

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం అర్బన్, ఆగస్టు 18: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత సాఫల్య పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ సరోజమ్మ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో జీవితాన్ని ఆరంభించి, రాష్ట్రపతిగా అత్యున్నత హోదాను అలంకరించి, గురువుల ఔన్నత్యాన్ని చాటి, దేశ అభ్యున్నతికి రాధాకృష్ణన్ పాటుపడ్డారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అదే స్ఫూర్తితో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు, ప్రధానాచార్యులతోపాటు వైద్య సామాజిక, సాంస్కృతిక, ఇతర వృత్తి రంగాల్లో శిక్షణ అందిస్తున్న గురువులకు జీవిత సాఫల్య పురస్కారాలు అందిస్తామన్నారు. డాక్టర్ రాధాకృష్ణన్ 126వ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబరు 8వ తేదీన తిరుపతిలో నిర్వహించే గురుపూజోత్సవంలో బంగారు నంది పురస్కారాలు, ఎక్సలెన్సీ, ఉత్తమ గురువుల పురస్కారాలు ఇవ్వనున్నామని పేర్కొన్నారు. 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను 6302908528, 9705313061, 9440225924 వాట్సాప్ నంబర్లకు పంపాలని కోరారు.

వధాన్య ఆలోచనలు నేటి యువతకు స్ఫూర్తి: కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు18: వధాన్య జనసొసైటీ ఆలోచనలు నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. సమాజం గురించి ఆలోచించే యువత సొసైటీలో ఉండటం అభినందనీయమన్నారు. ఆదివారం పంగల్ రోడ్డులోని ఆర్డీటీ ఎకాలజీ సెంటర్ వధాన్య జనసొసైటీ ఫౌండర్ అశోక్‌పడపాటి ఆధ్వర్యంలో ఆ సొసైటీ 13వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. యువత కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. మరిన్ని గొప్ప ఆలోచనలతో, ఆవిష్కరణలతో సమాజ శ్రేయస్సుకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. సొసైటీ సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలు మున్ముందు కొనసాగించాలన్నారు. ఏపీ టీఎస్ రాష్ట్ర ఐటీ అడ్వైజర్ డా. జేపీ చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతుందన్నారు. గ్రామీణ స్థాయి యువతకి ఐటీ రంగాన్ని మరింత చేరువ చేసేందుకు నూతన ఆలోచనతో స్టార్టప్‌లతో కొత్త పథకం ప్రారంభించనుందన్నారు. సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాల్ని ప్రభుత్వాలు, యువత స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యంతో నిర్వహించాలన్నారు. వధాన్య జనసొసైటీ ఫౌండర్ అశోక్ పడపాటి మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో రాబోవు రోజుల్లో డీఎస్సీ మెగా టాలెంట్ టెస్ట్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్టులు నిర్వహించనున్నామన్నారు. ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, కన్ఫామ్ టికెట్ సీఈఓ శ్రీపాద వైద్య, ప్రముఖ ఐటీ నిపుణుడు రామ్‌కుమార్ వర్మ, పర్యావరణవేత్త లెనిన్ బాబు, డిస్కవరీ అనిల్, వధాన్య జనసొసైటీ కో-ప్రెసిడెంట్ అరుణ్, సభ్యులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తిప్రదాత ఎంవీ రమణ

సంస్మరణ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

అనంతపురం విద్య, ఆగస్టు 18: ఎంవీ రమణ పోరాటాల స్ఫూర్తి ప్రదాత అని, విప్లవోద్యమానికి జీవితాన్ని అంకితం చేశారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కొనియాడారు. ఆదివారం నగరంలోని లలితకళాపరిషత్‌లో రమణ సంస్మరణ సభను నిర్వహించారు. జాతీయకార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వర్‌రావు, రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యులు జగదీష్, ఓబులేసు, ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంవీ రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయకార్యదర్శి నారాయణ మాటాడుతూ ఎంవీ రమణ సుమారు 60 ఏళ్లపాటు ఉద్యమంలో పనిచేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ ఉక్కుఉద్యమంలో ఎంవీ రమణ కీలకభూమిక పోషించారన్నారు. సామాన్య పార్టీశ్రేణుల్లో నిరాడంబరంగా కలసిపోయేవారన్నారు. సహాయకార్యదర్శి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సీమ కరువు నివారణ ఉద్యమంలో రమణ పాత్ర కీలకమైందన్నారు. సమాజశ్రేయస్సు తనవంతుగా నిత్యం కృషిచేశారని కొయాడారు. అనంతపురం ఎంపీ అంబికాలక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనంతపురం జిల్లా రైతాంగం, రాయలసీమ రైతుల సమస్యలపై ఆయనకు స్పష్టమైన అవగాహన ఉందన్నారు. ఆయన నుంచి అందరూ స్ఫూర్తి పొందాలని సూచించారు. అనంతరం జగదీష్, రాంభూపాల్, కోగటం విజయభాస్కర్ రెడ్డి, జాఫర్ ఎంవీ రమణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రామాంజినేయులు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్రఅధ్యక్షుడు జాన్సన్‌బాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రానాయక్, వేమయ్యయాదవ్, రమణయ్య, కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.



ఎంవీ రమణ చిత్రపటం నివాళి అర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

దోపిడీదారుల గుండెల్లో బాంబుపేల్చేది పాట

- పాలనలో మహిళలకు సగభాగం ఇవ్వాలి
- గద్దర్ వర్థంతి సభలో ఆయన కుమార్తె వెన్నెలమ్మ

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 18: చదువురాని వారికి సైతం మాట్లాడటం, రాయటం, నాట్యం నేర్పించి చైతన్యవంతులను చేసే పాటకు దోపిడీదారుల గుండెల్లో బాంబుపేల్చే శక్తి ఉంటుందని ప్రజా యుద్ధనౌక గద్దర్ కుమార్తె వెన్నెలమ్మ అన్నారు. ఆదివారం బహుజన యువసేన సామాజిక న్యాయ ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో గద్దర్ ప్రథమ వర్థంతి సభను నిర్వహించారు. ఆ వేదిక ప్రతినిధులు చంద్రచర్ల హరి, ఆదినారాయణ, కుళ్లాయప్ప అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభకు ముఖ్య అతిథులుగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, గద్దర్ కుమార్తె వెన్నెలమ్మ, అరుణోదయ కళామండలి ఉమ్మడి రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు విమలక్కతోపాటు జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి, పర్ ద సొసైటీ ఫౌండర్ పోతుల రాధాకృష్ణ, ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెన్నెలమ్మ మాట్లాడుతూ మహిళలను పాలనలో సగభాగం ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. పాలనలో సమానంగా కూర్చున్నప్పుడే మహిళాసాధికారత నెరవేరుతుందని గద్దర్ ఆకాంక్షించారన్నారు. విమలక్క మాట్లాడుతూ ప్రజలు చరిత్ర నిర్మాతలని వారిని గెలిపించడానికి పాట ఎప్పటికీ అండగా నిలుస్తుందని తెలిపారు.



మాట్లాడుతున్న వెన్నెలమ్మ

సమస్యలను పాటతో వివరించారు: ఎంపీ అంబికా

ప్రజానాట్య మండలిద్వారా పాటల రూపంలో పల్లె ప్రగతి, ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లిన ప్రజాకవి గద్దర్ అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కొనియాడారు. బానిస వర్గాల దుర్భర పరిస్థితులను కళ్లకు కట్టినట్లు పాటలతో తెలిపారన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగన్న, రాజారాం, నాగభూషణ, సుగమంచి శ్రీనివాసులు, రామకృష్ణ, రిటైర్డు న్యాయాధికారి కిష్టప్ప పాల్గొన్నారు.

కోర్టు పరిధిలోని భూములను ఎలా ఆక్రమిస్తారు?

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపాటు

కూడేరు, ఆగస్టు 18: కోర్టు పరిధిలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను ఎలా ఆక్రమిస్తారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. ఆదివారం ఆయనతోపాటు అగ్రిగోల్డ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాల నాగేశ్వరరావు, సీపీఐ నాయకులతో కలిసి కూడేరు మండలం కమ్మూరు వద్దనున్న అగ్రిగోల్డ్ భూములను పరిశీలించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కమ్మూరు వద్దనున్న ఫార్చ్యూన్ అనంత పేరుతో 221.45 ఎకరాల భూమిలో కొందరు వ్యక్తులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని అగ్రిగోల్డ్ బాధితులు అడ్డుకున్నారన్నారు. అమాయకులతో డబ్బులు కట్టించుకొని బాధితులకు న్యాయం చేయకుండా బినామీ పేర్లతో కొందరు వ్యక్తులు ప్లాట్లు వేసుకొని అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. కోర్టు ఆధీనంలో ఉన్న భూములను ఎలా వెంచర్లు వేస్తారని నిలదీశారు. అగ్రిగోల్డ్ కంపెనీలో కొందరు రాజకీయ నాయకులు తమ బినామీలను అడ్డుపెట్టుకొని రూ.5 వేల కోట్లు విలువ చేసే భూములను ఇప్పటికే అమ్మకాలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం తక్షణం దొంగల పేర్ల మీద ఉన్న భూములను స్వాధీనం చేసుకొని హైకోర్టులో అటాచ్‌లో ఉన్న భూములపై సర్వే నెంబర్ వారిగా విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్దేశ్వర, జిల్లా అధ్యక్షుడు నారాయణప్ప, ప్రధానకార్యదర్శి కుళ్లాయప్ప, అల్లీపీరా, ధనుంజయ, రాజశేఖర్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు నారాయణస్వామి, కేశవరెడ్డి, జాన్సన్‌బాబు, కుళ్లాయిస్వామి, వేమయ్య యాదవ్, పెరుగు సంగప్ప, రమణ, మల్లికార్జున, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

గంపమల్లయ్యకు ప్రత్యేక పూజలు

శింగనమల, ఆగస్టు 18: మండలంలోని గంపమల్లయ్య కొండ వద్ద శ్రావణ మాసం రెండో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏడాది శ్రావణ మాసంలో నాలుగు వారాలు గంపమల్లయ్యకు పూజలు చేయడం ఆనవాయితీ వస్తోంది. ఇక్కడ గంపమల్లయ్య గుహలోకి పోయే సన్నివేశం ప్రత్యేకమైనది. 2022లో గుహలోకి వెళ్లే సమయంలో పూజారి పాపయ్య ప్రమాదశాత్తు కొండ మీద నుంచి పడి మృతి చెందాడు. అప్పటి నుంచి రెవెన్యూ, పోలీసులు అధికారులు గుహ ప్రవేశాన్ని నిషేధించారు. గత వారం పూజారి పాపయ్య కుటుంబ సభ్యులు ఎలాంటి అనుమతులు లేకుండా గుహ ప్రవేశం చేయడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు పూజారి మునేంద్రను బైండోవర్ చేసిన విషయం తెలిసిందే. ఈ శని, ఆదివారాలు కొండ మీద బందోబస్తత ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భక్తులకు స్వామివారిని దర్శించుకునే ఏర్పాట్లు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ఆభరణాల సమర్పణ


ఆలయ అర్చకుడికి బంగారు మాంగళ్యాన్ని అందచేస్తున్న భక్తులు

గార్లదిన్నె, జూలై 28: మండలంలోని కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటిసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు రూ.59600 విలువ చేసే బంగారు అభరణాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతపురం పట్టణానికి చెందిన లావణ్య, సుధాకర్ బాబు దంపతులు ఆదివారం స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. అనంతరం 8.870 గ్రాముల బంగారు మాంగళ్యాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులకు అందచేశారు.

స్టాప్‌లాగ్ ఏర్పాటులో నిపుణుల కృషి అభినందనీయం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఆగస్టు 18: తుంగభద్ర జలాశయం 19వ గేటు కొట్టుకుపోవడంతో నీటి వృథాను అరికట్టేందుకు నిపుణులు, కార్మికులు చేసిన కృషి అభినందనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉధృతంగా ఉన్న నీటి ప్రవాహంలో స్టాప్‌లాగ్ అమర్చే సాంకేతికతకు కారణం సైన్స్, నూతన సవాళ్లను శాస్త్ర విజ్ఞానమే ఆవిష్కరించిందని అన్నారు. తుంగభద్ర డ్యామ్‌కు ఏర్పడిన ప్రమాదం నుంచి తాత్కాలికంగా బయటపడినప్పటికీ శాశ్వతంగా చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డ్యామ్ భద్రతపై పటిష్ట చర్యలు చేపట్టాలని, సమాంతర కాలువ నిర్మాణానికి కర్ణాటక ప్రభుత్వంతో వెంటనే చర్చలు ప్రారంభించాలని కోరారు.

వీరాంజనేయులుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడి నివాళి


వీరాంజనేయులు భౌతికకాయం వద్ద వెంకటశివుడు యాదవ్ నివాళి

అనంతపురం అర్బన్, ఆగస్టు 18: టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకులు వీరాంజనేయులు భౌతిక కాయానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ నివాళి అర్పించారు. ఆదివారం అనంతపురంలోని ఆయన నివాసంలో వీరాంజనేయులు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వీరాంజనేయులు మృతి టీడీపీకి తీరనిలోటు


నివాళులర్పిస్తున్న ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

అనంతపురంరూరల్, ఆగస్టు 18: టీడీపీ సీనియర్ నాయకులు నాపా వీరాంజనేయులు మృతి పార్టీకి తీరనిలోటని ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆదివారం మండలంలోని సిండికేట్‌నగర్ సమీపంలోని రామకృష్ణాపురంలో వీరాంజనేయులు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారితో మాట్లాడి మృతికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మాజీ మండల కన్వీనర్ చల్లా జయకృష్ణ, వీరాంజనేయులు, వెంకటప్ప, బిల్లా నాగరాజు, అల్లీపీర, అంజనేయులు, బ్యాళ్ల రాము, యాలేటి గోపాల్, ఓబుళపతి, ఎర్రిస్వామి, గంగాధర్, వన్నూర్‌స్వామి, సంగమేష్ పాల్గొన్నారు.

సిద్దరామయ్య నిజాయతీని మసకబార్చే యత్నం

● మాజీ మంత్రి శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 18: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అక్కడ ఇచ్చిన 5 గ్యారెంటీలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రభుత్వాన్ని అస్థిరపర్చాలన్న రాజకీయ కుట్రతో ఆయనపై అవినీతి మరక అంటించి తద్వార బీజేపీ రాజకీయ లబ్ధిపొందాలని చూడటం సరికాదని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఒక ప్రకటనలో ఖండించారు. గవర్నర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకొని ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. దీని ద్వారా సిద్దరామయ్య నాలుగు దశాబ్దాల నిజాయితీని మసకబార్చే ప్రయత్నం చేసినట్లుగా కనిపిస్తోందన్నారు. ఇలాంటివన్నీ ఆయన నిజాయితీ ముందు నిలబడవన్నారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సీబీఐ, ఈడీ, ఐటీ లాంటి సంస్థలను తమ పార్టీ కార్యకర్తలుగా మార్చుకొని రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం సరికాదన్నారు. ఇలాంటి వాటికి కాంగ్రెస్ పార్టీ భయపడదన్నారు. బీజేపీ అవినీతిని రూపుమాపాలనే ఉద్దేశ్యం ఉంటే కర్ణాటకలో బీజేపీ మిత్రపక్షం అయిన కుమారస్వామి అవినీతిపై గవర్నర్ విచారణకు ఆదేశించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 18: జిల్లాలో 2023-24 విద్యాసంవత్సరంలో పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధికమార్కులు సాధించిన రజక విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని రజక ఉద్యోగ విద్యావంతుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కమ్మన్న, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగనాథ్, ప్రభాకర్ కోరారు. పదోతరగతిలో 500 మార్కులకు పైన, ఇంటర్‌లో 850మార్కులకు పైన వచ్చిన రజక విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల విద్యార్థులు 31వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440501188 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలకు శ్రీకారం


రాఘవేంద్రస్వామి బృందావనానికి పూజలు చేస్తున్న అర్చకులు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 18: మొదటిరోడ్డులోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం స్వామివారి 353వ ఆరాధన మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. రాఘవేంద్రస్వామి బృందావనానికి ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మఠం కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

స్వామీజీ ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్యే కుటుంబం


ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న దత్త విజయానంద తీర్థ స్వామీజీ

అనంతపురం అర్బన్, ఆగస్టు 18: ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులు మైసూరు శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. ఆదివారం మైసూరు పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే ఆయన కుటుంబ సభ్యులు దత్త మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను స్వామీజీ ఆశీర్వదించారు. అనంతరం స్థానికంగా చాముండేశ్వరిదేవి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

రాప్తాడు, ఆగస్టు 18: స్థానిక బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు టీడీపీ నాయకులు దుప్పట్లు పంపిణీ చేశారు. మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి వివాహ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి విద్యార్థికి ఒక దుప్పటి అందజేశారు. నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో భైటిన్ ప్రసాద్, మండల కన్వీనర్ కొండప్ప ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, నంబూరి రమణ, వెంకట్రాముడు, ఫీల్డ్ అసిస్టెంట్లు శివ, సుధాకర్, ఉజ్జినేశ్వర పాల్గొన్నారు.

సౌత్‌జోన్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 18: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-16 బాలుర జట్టుకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా నుంచి సాత్విక్, నవదీప్, వరుణ్‌సాయి నాయుడులకు జట్టులో చోటు దక్కింది. 2024-25 సీజన్‌లో సౌత్‌జోన్ జట్టు తరఫున ఎంపికైన క్రీడాకారులు ప్రాతినిథ్యం వహిస్తారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి అభినందించారు.

ఉచిత గుండె వైద్యశిబిరం


గుండె వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యుడు

రామగిరి, ఆగస్టు 18: మండలంలోని నసనకోట గ్రామంలో ఆదివారం ఉచిత గుండె వైద్యశిబిరంతో పాటు పలురకాల వైద్యసేవలు అందించారు. మార్క్ సూపర్‌స్పెషాలిటీ గుండె ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పరిటాలసునీత, పరిటాలశ్రీరామ్, సిద్దార్థ తదితరుల సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరానికి పలువురు ముఖ్య అతిథులుగా హాజరుకాగా వందకు పైగా రోగులకు పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందించారు. మాజీ జడ్పీటీసీ రామ్మూర్తినాయుడు, మండలకన్వీనర్ సుధాకర్, ప్రధానకార్యదర్శి మారుతిప్రసాద్, గంగంపల్లి గంగాధర్, రామకృష్ణ, కాంతస్వామి, ముత్యాలప్ప, రమేష్ పాల్గొన్నారు.

ఫోన్ కాల్ సంభాషణ వ్యక్తిగతం

● టీడీపీకి, నాయకులకు సంబంధం లేదు: గణేష్‌నాయుడు


మాట్లాడుతున్న గణేష్‌నాయుడు

అనంతపురం క్రైం ఆగస్టు 18: స్నేహ చికెన్స్ సంస్థ ఉద్యోగితో తాను ఫోన్ కాల్‌లో మాట్లాడిన సంభాషణ పూర్తిగా నా వ్యక్తిగతమని యల్లనూరు మండలం ఎస్. కొత్తపల్లికి చెందిన గణేష్‌నాయుడు అన్నారు. స్నేహ చికెన్స్ ఉద్యోగిని టీడీపీ ఆఫీస్ పేరుతో బెదిరిస్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో పోలీసులు గణేష్ నాయుడును అనంతపురం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు ఆదివారం పిలిపించారు. ఉద్యోగితో సంభాషించిన అంశాలపై విచారణ చేశారు. స్నేహ చికెన్స్ సంస్థతో తనకున్న లావాదేవీలు, వాస్తవంగా జరిగిన విషయాలను గణేష్‌నాయుడు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను కోళ్ల ట్రేడర్ అని, రమణారెడ్డి తన భాగస్వామి అన్నారు. ఆ సంస్థతో తనకు లావాదేవీలు ఉన్నాయన్నారు. పలు కారణాలతో కోళ్ల సరఫరా చేయకపోవడంతో ఆవేదనతో మద్యం మత్తులో టీడీపీ అనంతపురం ఆఫీస్ వద్దకు వస్తే మాట్లాడతానని ఉద్యోగిని బెదిరించానన్నారు. ఇందులో టీడీపీ కార్యాలయానికి, నాయకులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. టీడీపీ కార్యాలయం పేరు వాడినందుకు క్షమాపణలు చెబుతున్నానన్నారు.

టమోటాకు వర్షం దెబ్బ

● గిట్టుబాటుకాక మండీల్లోనే వదిలేస్తున్న రైతులు
● పరిసర ప్రాంతాల్లో పారవేస్తున్న మండీ యజమానులు


టమోటా మార్కెట్ వెనుకభాగంలో కనిపిస్తున్న టమోటా దిబ్బలు

అనంతపురంరూరల్, ఆగస్టు 18: టమోటాకు వర్షం దెబ్బ పడింది. టమోటా మార్కెట్‌లో నో సేల్ కింద పడిపోతున్నాయి. వాటిని రైతులు వెనక్కు తీసుకువెళ్లలేక మండీల్లోనే వదిలేసి వెళ్లిపోతున్నారు. ఆ సరుకును మండీల నిర్వాహకులు ట్రాక్టర్ల ద్వారా మార్కెట్ వెనుక భాగంలో పారబోస్తున్నారు. ఈక్రమంలో ఆ ప్రాంతం టమోటా దిబ్బలను తలపిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు టమోటా పంటపై ప్రభావం చూపుతోంది. వర్షాలకు పంట తడిచి నీరు కాయలు పడుతున్నట్లు ఆయా వర్గాల సభ్యులు చెబుతున్నారు. వాటినే రైతులు మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. ఈక్రమంలో కాయలు నీరుగారిపోవడంతో వ్యాపారులు వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. సరుకు మండీల్లో నోసేల్ కింద పడిపోతున్నాయి. వాటిని రైతులు వెనకుతీసుకొని వెళ్లలేక అక్కడే వదిలి వెళ్లిపోతున్నారు. మండీల నిర్వాహకులు ఒక్కో మండీ నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మిగిలిపోయిన సరుకును మార్కెట్ వెనుకభాగంలోని ప్రదేశాల్లో పారవేస్తున్నారు. ఇదిలా ఉండగా అసలే ధరలేమితో సతమతమవుతున్న రైతులను వర్షం మరింత నష్టాల్లోకి నెట్టివేస్తోంది. లక్షలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటను వదివెళ్లాల్సి వస్తోందంటూ ఆవేదన చెందుతున్నారు.

కొనసాగిన డాక్టర్ల ఆందోళన

అనంతపురం టౌన్, ఆగస్టు 18: కోల్‌కతాలో పీజీ వైద్యురాలి హత్యాచార ఘటనపై ఆదివారం జిల్లా కేంద్రంలో ఆందోళనలు కొనసాగాయి. జిల్లా సర్వజన ఆసుపత్రిలో వందలాది మంది జూనియర్ డాక్టర్లు, పీజీలు, మెడికోలు రిలే దీక్షలు చేపట్టారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిరసన దీక్ష కొనసాగించారు. డాక్టర్‌ను హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని, డాక్టర్లకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఘటనపై విచారణ జరిపి నిందితులకు వెంటనే శిక్ష అమలు చేయాలన్నారు. నిందితులను శిక్షించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. డాక్టర్ల ఆందోళనకు పలు ఉద్యోగ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

సూర్యచంద్రారెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

● ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

గార్లదిన్నె, ఆగస్టు 18: రైతు సూర్యచంద్రారెడ్డి కుటుంబానికి న్యాయం జరిగే వరకు రెడ్డి సంఘం అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముకుందాపురం గ్రామ సర్వే నెంబరు 580లో 5 ఎకరాల భూమి కోసం గత కొంత కాలం నుంచి అదే గ్రామానికి చెందిన సూర్యచంద్రారెడ్డితో కొంతమందికి భూసమస్య కారణంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం నరేష్‌కుమార్‌రెడ్డి ముకుందాపురానికి వెళ్లి రైతు కుటుంబ సభ్యులతో మాట్లాడి, భూమికి సంబంధించి పత్రాలను పరిశీలించి మాట్లాడారు. తమకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని 25 ఏళ్ల నుంచి సాగుచేసుకుంటున్నామని, ఇందుకు సంబంధించి అన్ని పత్రాలు తమవద్ద ఉన్నాయన్నారు. సంవత్సరం నుంచి కొంతమంది ఆ భూమి మాది అంటు బెదిరిస్తూ అడ్డు వస్తున్నారని కుటుంబ సభ్యులు వాపోయారు. అడ్డుబోతే ఎస్సీ, ఎస్టీ కేసులు పెడుతామంటు బెదిరిస్తున్నారని ఆరోపించారు. పంటలు సాగుచేసుకునే సమయంలో అడ్డు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.... ఏళ్ళ తరబడి సాగులో ఉన్న రైతు సూర్యచంద్రారెడ్డితో తమదంటు గొడవలు పడడం బాధకరమన్నారు. భూమికి సంబంధించి పత్రాలు ఉంటే తీసుకురావాలని తెలిపారు. అంతే కానీ ఎస్సీ, ఎస్టీ కేసులు పెడుతామని బెదిరించడం సరైంది కాదన్నారు. సూర్యచంద్రారెడ్డి కుటుంబ సభ్యులను బెదిరిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భూమి పత్రాలను పరిశీలిస్తున్న రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

పురాతన ఆలయాల అభివృద్ధికి సహకారం

● ట్రైనీ కలెక్టర్ వినూత్న


ఆత్మారామస్వామి దేవాలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్ వినూత్న

శింగనమల, ఆగస్టు 18: పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందించనున్నట్లు ట్రైనీ కలెక్టర్ వినూత్న తెలిపారు. ఆదివారం శింగనమలలో ఆత్మాసీతారామస్వామి ఆలయాన్ని ఆమె సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను ఇక్కడి గ్రామస్థులు, అర్చకుడిని అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులు బోయ సత్యనారాయణ, విద్యా కమిటీ చెర్మన్ సురేష్‌కూమార్, వెంకటేశ్, నాగముని, వెంకటనారాయణ రాయల్, సత్తి, శివ, ప్రకాశ్ ట్రైనీ కలెక్టర్‌తో మాట్లాడుతూ రామస్వామి దేవాలయం పూరతమైనదని, ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని, ఇప్పటికే నివేదికలు పంపినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ హనుమాన్ ప్రసాద్, ఈఆర్వో ఎర్రితాతయ్య పాల్గొన్నారు.

సైనికుడు సంజీవకుమార్‌కు సన్మానం


సంజీవకుమార్‌ను సన్మానిస్తున్న మాజీ సైనికులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు18: స్వాతంత్య్ర వేడుకల్లో ముఖ్యమంత్రి మార్చ్‌పాస్ట్ పరేడ్‌లో పాల్గొన్న జిల్లాకు చెందిన సైనికుడు సంజీవకుమార్‌ను మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో సంజీవకుమార్‌ను శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. కెప్టెన్ షేకన్న మాట్లాడుతూ జిల్లా తరఫున వెళ్లి మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్న సంజీవకుమార్ జిల్లా మాజీ సైనికులకు ఆదర్శంగా నిలిచారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కెప్టెన్ ఉమామహేశ్వరరావు, మాజీ సైనికులు తిమ్మారెడ్డి, గొల్ల ఈశ్వరయ్య, తలమర్ల కృష్ణ, రామ్‌గోపాల్, నాగరాజు, బీఏ హుస్సేన్, ఇస్మాయిల్, షఫి, బాబా, బాలస్వామి, పెంచలయ్య, మదార్ సాహెబ్, అబ్దుల్ వహాబ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు బూట్ల పంపిణీ


క్రీడాకారులకు బూట్లు అందజేస్తున్న దాత శివరామాంజుల రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 18: కబడ్డీ క్రీడాకారులకు బూట్లు అందజేశారు. నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో సాధన చేస్తున్న కబడ్డీ క్రీడాకారులకు రూ.15వేలు విలువ చేసే క్రీడా బూట్లను ఆదివారం ఎస్ఆర్ఎం బిల్డర్ యాజమాని శివ రామాంజులరెడ్డి అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో కబడ్డీ శాప్ కోచ్ అనీల్‌కుమార్, ఎస్ఆర్ఎం ప్రతినిధులు బ్రహ్మ, వినీల్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

బత్తలపల్లి ఆగస్టు 18: శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలోని అనంతసాగరంలో ప్రమాదవశాత్తు నీళ్ల బకెట్‌లో పడిన ఓ చిన్నారి చికిత్స పొందుతూ మరణించింది. రాప్తాడు మండలం పెనరకుంటకు చెందిన ఆదెప్ప, బత్తలపల్లి మండలం అనంతసాగరంలో ఐదేళ్ల క్రితం పుష్పను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూమార్తెలు. పుష్ప తమ్ముడి వివాహానికి అనంతసాగరం గ్రామానికి వెళ్లింది. శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులు పెళ్లి పనుల్లో ఉండగా.. పుష్ప చిన్న కుమార్తె మేగహర్షిత (18 నెలల) ఆడుకుంటూ బాత్‌రూంలోకి వెళ్లి... నీళ్ల బెకెట్‌లో పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఆ చిన్నారి మరణించింది.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు
- టీబీ డ్యాంకు స్టాప్‌లాగ్ ఏర్పాటుపై హర్షం
- రైతులు, టీడీపీ శ్రేణులతో కలిసి సంబరాలు

బొమ్మనహాళ్, ఆగస్టు 18: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, సీఎం చంద్రబాబు, ఇంజనీరింగ్ నిపుణుడు కన్నయ్య నాయుడు రైతుల పాలిట ఆపద్బాంధవుల్లా నిలిచారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. తుంగభద్ర జలాశయం 19వ నెంబర్ క్రస్టగేట్ ఇటీవల నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి నీరు వృథాగా పోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్టాప్‌లాగ్ గేట్‌ను ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేయడంతో ఆదివారం హెచ్చెల్సీపై 1వ డిస్ట్రిబ్యూటరీ వద్ద ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సమక్షంలో టీడీపీ శ్రేణులు, రైతులు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ.. రాయలసీమలో రైతుల ప్రయోజనాలను పరిరక్షించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేసిందన్నారు. ఆయకట్టు రైతుల పాలిట సీఎం చంద్రబాబు, ఇంజనీరింగ్ నిపుణుడు కన్నయ్యనాయుడు ఆపద్బాంధవుల్లా నిలిచారన్నారు. ఈ నెల 10వ తేదీన 19వ నంబర్ గేట్ నీటి ప్రవాహంలో కొట్టుకుపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన చెందారన్నారు. డ్యాంలో దాదాపు 60 టీఎంసీల నీరు వృథాగా పోతుందని, మరి అంత నీరు వస్తుందో.. లేదో, మళ్లీ డ్యాం నిండుతుందో.. లేదో.. అని బెంగపెట్టుకున్నారన్నారు. ఈ సమయంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కన్నయ్య నాయుడు తుంగభద్ర డ్యాంను సందర్శించి నీటి ప్రవాహంలోనే స్టాప్ లాగ్ గేట్‌ను ఏర్పాటు చేయవచ్చని సూచించారని, ఈ క్రమంలో ఆయన రాత్రి పగలు అక్కడే ఉండి ఇంజనీర్లతో, నైపుణ్యమున్న కార్మికులతో స్టాప్ లాగ్ గేట్ ఏర్పాటు చేయించారని తెలిపారు. శనివారం రాత్రికి మొత్తం ఐదు పార్టులు బిగించడం హర్షణీయమన్నారు. పూర్తిస్థాయిలో నీటిని తుంగభద్ర డ్యాంలో నిల్వ చేసుకోవడానికి అనుకూలం ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంలో ఆయకట్టు రైతులతో కలిసి సంబరాలు చేసుకుంటున్నట్లు తెలిపారు. సాగునీటిని పూర్తిస్థాయిలో అందిస్తామని రైతులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు యర్రగుంట్ల వెంకటేశులు, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుమ్మరి మల్లికార్జున, నాయకులు అప్పారావు, సల్లాపురం బాబు, పయ్యావుల మోహన్, పయ్యావుల నాగరాజు, సోమనాథ్‌గౌడ్, నవీన్, మల్లీడు శ్రీనివాసులు, సైకిల్‌షాప్ హనుమంత తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ నాయకులకు స్వీట్లను తినిపిస్తున్న ఎమ్మెల్యే కాలవ

బ్రాంచ్ కాలువ పరిశీలన

తుంగభద్ర ఎగువకాలువ నుంచి వచ్చే ఒకటవ డిస్ట్రిబ్యూటరీని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పరిశీలించారు. ఆ డిస్ట్రిబ్యూటరీ అధ్వానంగా ఉండడంతో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపి మరమ్మతులు చేయించారు. ఇటీవల పనులు పూర్తి కావడంతో ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హెచ్చెల్సీని నిర్వీర్యం చేసిందన్నారు. డిస్ట్రిబ్యూటర్లను కూడా మరమ్మతులు చేయలేదన్నారు. దీంతో చివరి ఆయకట్టుకు నీళ్లు వెళ్లలేని దుస్థితి ఉండేదన్నారు. రైతుల సంక్షేమం కోసం నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో మాట్లాడి మరమ్మతులు చేసేందుకు చొరవ చూపినట్లు తెలిపారు. చివరి ఆయకట్టు రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


వీరభద్రస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం

ఉరవకొండ, ఆగస్టు 18: పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలను చేశారు. అలాగే లక్ష్మీనారాయణ హోమం, వరుణ యాగం, కుబేర హోమాలను నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో అలంకరించి, మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణోత్సవం

పట్టణంలోని పేట వీరభద్రస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత అర్చకులు ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అంతకు మునుపు గంగనీటిని ,ఉత్సవ మూర్తులను మేళతాళాల మధ్య ఊరేగింపు చేశారు. అనంతరం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి మూలవిరాట్‌లను పట్టు వస్త్రాలతో అలంకరించి అభిజిత్ లగ్నం నందు కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

పోలీసుల అదుపులో నలుగురు అనుమానితులు

రాయదుర్గం, ఆగస్టు 18: కారులో గ్యాస్ కట్టర్లు కలిగి ఉండి అనుమానితులుగా ఉన్న నలుగురు వ్యక్తులను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. తెల్లవారుజామున పోలీసులు బళ్లారి రోడ్డులోని కుంటుమారమ్మ గుడి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా కనిపించిన కారును ఆపి తనిఖీలు చేశారు. కారులో గ్యాస్‌కట్టర్లు, సిలిండర్లు ఉండడంతో పాటు ఆరుగురు వ్యక్తులు అనుమానితులుగా కనిపించారు. పోలీసులు ఆరా తీయగా ఇద్దరు పారిపోయారు. దీంతో మిగిలిన నలుగురిని అదుపులోకి తీసుకుని, కారును స్వాధీనం చేసుకుని రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇటీవల లింగాల బండ పశుపతినాథుని ఆలయంలో గ్యాస్‌కట్టర్లతో తలుపులు బద్ధలు కొట్టి గుప్తనిధుల కోసం మూలవిరాట్ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లింగాలబండ సమీపంలో వీరు పట్టుబడడంతో ఆ సంఘటన సూత్రధారులుగా వీరే ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. అలాగే జిల్లాలో ఏటీఎం లను గ్యాస్ కట్టర్లతో ధ్వంసం చేసి నగదును దోచుకెళుతున్న సంఘటనలు కూడా జరిగా యి. ఓబుళాపురం మైనింగ్ కొండల్లో సీబీఐ సీజ్ చేసిన వాహనాల తుక్కును గ్యాస్ కట్టర్ల తో కట్ చేసి సొమ్ము చేసుకుంటున్న 10 మందిని అదుపులోకి తీసుకోగా మరికొందరు పారిపోయారు. ఈ నేపథ్యంలో నలుగురు పట్టుపడడంపై పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు.

నేలకూలిన భారీ వృక్షం

బొమ్మనహాళ్, ఆగస్టు 18: మండలంలోని దేవగిరి క్రాస్ వద్ద భారీ చింతచెట్టు నేలకూలింది. శనివారం రాత్రి భారీగా వీచిన గాలికి బళ్లారి, కళ్యాణదుర్గం రహదారి పక్కన ఉన్న చెట్టు విరిగిపడింది, రోడ్డుకి అడ్డంగా కాకుండా పక్కకు పడిపోవడంతో రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగలేదు. చెట్టు దెబ్బతినడంతోనే గాలికి విరిగిపడిందని స్థానికులు తెలిపారు.


విరిగి పడిన చింతచెట్టు

రేపటి నుంచి రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

తాడిపత్రి, ఆగస్టు 18: పట్టణంలోని రాఘవేంద్ర స్వామి మఠంలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు స్వామివారి ఆరాధనోత్సవాలు జరగనున్నాయి. 19న సామూహిక సత్యనారాయణస్వామి పూజ, ధ్వజారోహణం, లక్ష్మీపూజ, గోపూజ, మహామంగళహారతి, 20న పూర్వారాధనలో భాగంగా నిర్మాల్య విసర్జన, అష్టోత్తర పారాయణ క్షీరాభిషేక పంచామృతాభిషేకం, పాదపూజ, కనక మహాపూజ, తులసీ అర్చన, హస్తోదకం, 21న మధ్యారాధనలో భాగంగా నిర్మాల్య విసర్జనము, అష్టోత్తర పారాయణ క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, పాదపూజ, మహామంగళహారతి, భక్తులకు అన్నదానం, సాయంత్రం రథోత్సవం, 22న ఉత్తరారాధనలో భాగంగా అష్టోత్తర క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, పాదపూజలు, స్వామివారి రథోత్సవం తదితర పూజలు నిర్వహించనున్నారు. మహోత్సవాలకు భక్తులు పెద్దఎత్తున హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కణేకల్లు, ఆగస్టు 18: మండలంలోని హనుమాపురం గ్రామంలో పునర్నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. గత ఐదురోజులుగా ఆలయంలో వివిధ కార్యక్రమాలను అర్చకులు, గ్రామస్థులు పెద్దఎత్తున నిర్వహించారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం నూతన విగ్రహాలను ప్రతిష్ఠించారు. మహాకుంభ సంప్రోక్షణ, చతుర్వేద పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. సర్పంచ్ జయరాంచౌదరి, ఎంపీటీసీ సభ్యుడు నరేంద్ర, గ్రామస్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

రహదారులను బాగు చేయండి

కణేకల్లు, ఆగస్టు 18: మండల వ్యాప్తంగా మరమ్మతులకు గురైన రహదారులు, బ్రిడ్జిలను వెంటనే బాగు చేయాలని సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని సొల్లాపురం, హనకనహాళ్ రహదారులతో పాటు మాల్యం బ్రిడ్జిని ఆదివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రహదారులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి రహదారులు, బ్రిడ్జిలను బాగు చేయాలని కోరారు. నాయకులు నాగార్జున, కొత్రేష్, గురుస్వామి, దుర్గన్న, ఎల్లప్ప, రామాంజినేయులు, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

హెచ్చెల్సీలో కొట్టుకొచ్చిన గుర్తుతెలియని శవం

డీ.హీరేహాళ్, ఆగస్టు 18: మండలంలోని నాగలాపురం సమీపంలో గల హెచ్చెల్సీలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొచ్చినట్లు స్థానికులు గుర్తించారు. కర్ణాటకలోని బళ్లారి వైపు నుంచి కణేకల్లు చెరువు వరకు హెచ్చెల్సీ ప్రవహిస్తోంది. బళ్లారి వైపు నుంచి హెచ్చెల్సీలో సుమారు 45 ఏళ్ల వయసు గల పురుషుడి మృతదేహం బోర్లా పడి నీటి ప్రవాహంలో కొట్టుకొచ్చింది. ఆ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఎవరూ స్పందించకపోవడంతో అలాగే కెనాల్ లో కొట్టుకుపోయింది.

అర్చకురాలు మృతి

పామిడి, ఆగస్టు 18: పట్టణంలోని భోగేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు దేవగుడి సోమశంకర్ శర్మ సతీమణి, ప్రసన్న పార్వతీదేవి అమ్మవారి అర్చకురాలు పార్వతమ్మ(70) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆలయ ఈఓ క్రిష్ణయ్యతో పాటు గ్రామపెద్దలు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.


పార్వతమ్మ(ఫైల్)

డ్రైవర్‌పై కేసు నమోదు

తాడిపత్రి, ఆగస్టు 18: పట్టణ సమీపంలోని కడప రోడ్డులో ఈనెల 14వ తేదీ జరిగిన రోడ్డుప్రమాదానికి కారణమైన ఐషర్ డ్రైవర్ నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కాటమయ్య ఆదివారం తెలిపారు. కడప రోడ్డులోని ఎమ్మార్సీ భవనం ఎదురుగా ఈనెల 14న స్థానిక కృష్ణాపురం మూడో రోడ్డుకు చెందిన అక్కిరెడ్డి బైక్‌లో వెళుతుండగా వెనుకవైపు నుంచి ఐషర్ వాహనం ఢీకొట్టింది. దీంతో అక్కిరెడ్డి తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఆదివారం డ్రైవర్‌పై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి

పెద్దపప్పూరు, ఆగస్టు 18: స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని మండలకేంద్రంలోని శ్రీ హరేరామ ఆశ్రమ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సేవా సంఘాల నాయకులు ఆదినారాయణ, పురుషోత్తం తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బైక్ దొంగ అరెస్ట్

గుంతకల్లు టౌన్, ఆగస్టు18: మోటర్ బైక్‌లను దొంగతనం చేసిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ పట్టణంలోని సౌత్ క్యాబిన్, ట్విన్‌లైన్ సర్కిల్‌లో పార్కింగ్ చేసిన మోటర్ బైక్‌లను ఎత్తుకెళ్లాడన్నారు. ఆదివారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ద్విచక్రవాహనంలో వెళ్తుండగా మహమ్మద్ ఇర్ఫాన్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి రూ. 2.50లక్షల విలువ చేసే 2 హోండా షైన్, 2 స్ప్లెండర్ ప్లస్, 1ప్యాషన్ ప్రో బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఇతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.


స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న సీఐ

నీటి కుంటలో పడి మహిళ మృతి

విడపనకల్లు, ఆగస్టు 18: మండలంలోని హావళిగి గ్రామంలో నీటి కుంటలో పడి మహిళమృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. హావళిగికి చెందిన చాకలి లింగమ్మ(32) ఆదివారం సాయంత్రం గ్రామ చివరలోని నాగుల కుంటలో బట్టలు ఉతకటానికి తన 9ఏళ్ల కూతురుతో కలిసి వెళ్లింది. బట్టలు ఉతుకుతున్న సమయంలో ఫిట్స్ వచ్చాయి. దీంతో నీటి కుంటలో పడి పోయింది. కుమార్తె గట్టిగా కేకలు వేయగా సమీప పొలాల్లో రైతులు పరుగున వచ్చారు. ఆలోపే లింగమ్మ నీటి మునిగింది. కుంటలో మృత దేహాన్ని బయటకు తీయటానికి రాత్రి అయ్యింది. పోస్టు మార్టం నిమిత్తం ఉరవకొండ ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు. లింగమ్మకు, భర్త నాగేంద్ర , ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాల్తూరు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి, ఆగస్టు 18: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గార్లదిన్నెకు చెందిన మధుసూదనాచారి ఆదివారం పని నిమిత్తం గుత్తికి వచ్చారు. కొద్దిసేపటికి స్వగ్రామానికి డీజిల్ ఆటోలో వెనుక కూర్చొని ప్రయాణిస్తున్నాడు. అనంతపురం రోడ్డులోని గోల్డెన్ కేఫ్ సమీపంలో రాగానే స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాశీపురం వద్ద ఇద్దరికి..

రాయదుర్గం రూరల్: మండలంలోని కాశీపురం గ్రామం వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కాశీపురం గ్రామానికి చెందిన భీమప్ప, జగదీష్ కలిసి బైక్‌పై సమీపంలోని గేటు వద్దకు వస్తుండగా మార్గంమధ్యలో వెనుకవైపు నుంచి ఆటో వచ్చి ఢీ కొట్టింది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం భీమప్పను అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బంధువులు తెలిపారు.

ఏ. కొండాపురం శివారులో ఇద్దరికి..

పుట్లూరు: మండలంలోని ఏ. కొండాపురం గ్రామశివారులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వచ్చి లారీ ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. దీంతో బైక్‌లో వెళుతున్న వరదాయపల్లి గ్రామానికి చెందిన కంబగిరి, రమేష్‌లకు గాయాలయ్యాయి. ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, ఆగస్టు 18: పట్టణంలోని సీఐటీయూ కాలనీలో నివాసముంటున్న ఆది నారాయణ(43) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదినారాయణ గతంలో రైల్వే స్టేషన్‌లో సమోసాలు అమ్మేవాడు. ప్రస్తుతం ఇంటి వద్ద ఖాళీగా ఉండి మద్యానికి బానిసయ్యాడు. పనికి పోకుండా ఇలా ఉంటే కుటుంబం ఎలా సాగుతుందని భార్య గొడవ పడింది. ఇందుకు మనస్థాపం చెందిన అతను ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య సుమలత, ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

కడుపునొప్పి తాళలేక యువకుడు..

యాడికి: మండలకేంద్రంలో ఓ యువకుడు కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తిప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దిద్దేకుంట కులశేఖర్‌రెడ్డి, కుమారి దంపతులు మండలకేంద్రంలోని నారాయణస్వామి కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు పూర్ణచంద్రారెడ్డి (23) సంతానం. పూర్ణచంద్రారెడ్డి డిగ్రీవరకు చదివి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలోని ఫార్మసీలో పనిచేసేవాడు. నెలరోజులక్రితం ఉద్యోగం మానేసి ఇంటివద్దనే ఉంటున్నాడు. కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్న అతను ఆదివారం రాత్రి ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


పూర్ణచంద్రారెడ్డి (ఫైల్)

23న డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా

గుంతకల్లుటౌన్, ఆగస్టు18: పట్టణంలోని రైల్వే ప్రాంతంలోకి ప్రవేశించకుండా అడ్డంగా నిర్మించిన గోడలను తొలగించాలని కోరుతూ ఈనెల 23న డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి బీ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆయన సమావేశంలో మాట్లాడారు. రైల్వే అధికారులు రహదారులను మూసివేయడం వల్ల రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 23న జరిగే ధర్నాకు పెద్ద ఎత్తున ప్రజలు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, రంగమ్మ, షబ్బీర్, సునీల్‌కుమార్, తిమ్మప్ప పాల్గొన్నారు.

గుంతకల్లులో భారీ వర్షం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 18: పట్టణంలో శనివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన గుంతబావి ఏరియా, పాతబస్టాండ్, తిలక్‌నగర్, అంబమ్మ ఆలయం, మార్కండేయ ఆలయం, రాజేంద్రనగర్ కాలనీ వరదనీటితో జలయమయ్యాయి. గత నాలుగు రోజుల నుంచి ఎండ వేడిమికి అల్లాడుతున్న ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు.

సాంకేతిక పరిజ్ఞానం అవసరం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 18: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అవసరమని వ్యక్తిత్వ వికాస శిక్షకురాలు కానిస్టేబుల్ మునెమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్ఈయస్ కంప్యూటర్ శిక్షణ సంస్థలో ఆదివారం వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మునెమ్మ పాల్గొని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నూతన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి కృషిచేయాలన్నారు. లక్ష్యంతో కష్టపడితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్‌క శిక్షణ సంస్థ డైరెక్టర్ జయన్న పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కణేకల్లు, ఆగస్టు 18: మండలంలోని ఆలూరు వద్ద రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని, అందులోని 80 ప్యాకెట్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ శంకర్‌రెడ్డి తెలిపారు. కణేకల్లుకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఆదివారం ఓ వాహనంలో బియ్యాన్ని తరలిస్తుండగా.. ఈ విషయాన్ని కొంతమంది రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణకు ఫోన్ ద్వారా సమాచారం అందించారని, ఆయన ఆదేశాల మేరకు తాము వాహనాన్ని వెంబడించి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 18: పట్టణంలోని రాచప్ప బావి వీధిలో ఉన్న రెండు ఇళ్లల్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. రాచప్ప బావి వీధిలో నివాసమున్న కామరాజు, శివ కుటుంబ సభ్యులతో కలిసి పని నిమిత్తం తమ బంధువుల ఊర్లకు వెళ్లారు. ఇదే అదునుగా దొంగలు వారి ఇళ్లల్లో చొరబడ్డారు. శివ ఇంట్లో రెండు తులాల బంగారం, కామరాజు ఇంట్లో రూ. 30 వేల నగదు దొంగలించినట్లు బాధితులు తెలిపారు. ఆదివారం ఉదయం వచ్చి చూడగా తమ ఇళ్లల్లో చోరీ జరిగినట్లు గుర్తించామని, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ఆలయాలను సందర్శించిన కలెక్టర్

తాడిపత్రి, ఆగస్టు 18: పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణ స్వామి ఆలయాలను కలెక్టర్ వినోద్‌కుమార్ దంపతులు ఆదివారం సందర్శించారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామివార్లను దర్శనం చేయించి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. అలాగే స్వామివార్ల చిత్రపటాలు, ప్రసాదాలను అందజేశారు. తర్వాత ఆలయాల చరిత్ర, శిల్పకళల గురించి కలెక్టర్‌కు వివరించారు.


బుగ్గరామలింగేశ్వరాయంలో కలెక్టర్ దంపతులు

సరుకులను సక్రమంగా అందించాలి

పామిడి, ఆగస్టు 18: మండలంలోని రేషన్ దుకాణాల డీలర్లు.. లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను సక్రమంగా సరఫరా చేయాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. పట్టణ స్టోర్ డీలర్లు ఆదివారం ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న ప్రతి నిత్యావసర సరుకులను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. లబ్ధిదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, విభిన్న ప్రతిభా వంతుల జిల్లా అధ్యక్షులు అప్పన్నగారి కుమార్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న స్టోర్ డీలర్లు

భారతీయ యువమోర్చాను బలోపేతం చేస్తాం

గుంతకల్లు, ఆగస్టు18: ప్రధాని నరేంద్రమోదీ పరిపాలనను మెచ్చి కమ్యూనిస్టు పార్టీల నాయకులు సైతం భారతీయ యువమోర్చాలో చేరారని, ఈ సంఘాన్ని గ్రామ స్థాయిలోనూ బలోపేతం చేస్తామని యువమోర్చా జిల్లా అధ్యక్షుడు మంజులా వెంకటేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఇల్లూరు భవన్‌లో ఆదివారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యూ మనోహర్, మరో 200 మంది కార్యకర్తలు భారతీయ యువమోర్చాలో చేరారన్నారు. ఎందరో యువకులు యువమోర్చా పట్ల ఆకర్షితులౌతున్నారన్నారు. గ్రామస్థాయిలోనూ బలోపేతం చేస్తామని వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో యువమోర్చా జిల్లా కార్యదర్శి ఎం కేశవ, పట్టణాధ్యక్షుడు రవితేజ, కార్యదర్శి రవీంద్ర, ఉపాధ్యక్షుడు లింగేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 18: బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆదివారం వారు పట్టణంలోని బీరప్ప సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందూవులపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రపంచ దేశాలన్నీ శాంతియుతంగా, స్వేచ్ఛగా జీవనం సాగించాలని చెప్పే ఐక్యరాజ్యసమితి ఈ రోజు మౌనంగా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఐక్యరాజ్యసమితి స్పందించి బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో వడ్డెర్ల సంఘం యూత్ ఉపాధ్యక్షులు వడ్డె రమేష్, గిరిధర్‌రెడ్డి, మార్వాడి సంఘం అధ్యక్షుడు జగదీష్ ప్రసాద్ శార్మా, కమ్మ సంఘంనాయకుడు బండారు కృష్ణమూర్తి, ఎస్సీ సంఘం నాయకులు పురంధర్, ఎం. కేశవ, రామాంజనేయులు, వాల్మీకి సంఘం నాయకులు హరి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటల పరిశీలన

గుంతకల్లు టౌన్, ఆగస్టు 18: మండలంలోని నాగసముద్రం గ్రామంలో శుక్ర, శనివారం రాత్రి కురిసిన వర్షాలకు వేరుశనగ, మొక్కజొన్న, కంది పంటలకు నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయ అధికారి స్వాతి పేర్కొన్నారు. గ్రామంలోని పంటలను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25హైక్టార్లలో వేరుశనగపంటకు సంబంధించి 35 మంది రైతులకు, 15 హెక్టార్లలో మొక్కజొన్న పంటకు సంబంధించి నలుగురు రైతులకు, 60 హెక్టార్లలో కందిపంటకు సంబంధించి 72మంది రైతులకు నష్టం జరిగిందన్నారు. పంట నష్టం నివేదికను జిల్లా అధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు.


నాగసముద్రం వద్ద మొక్కజొన్న పొలంలో నిలిచిన నీరు

పెద్దపప్పూరు: మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి, ఈదురుగాలుల ధాటికి దెబ్బతిన్న అరటి, మొక్కజొన్న, వరి పంటలను అగ్రికల్చర్ అధికారి అంజనేయులు, హార్టికల్చర్ ఏఓ ఉమాదేవి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని తెలిపారు.

వర్షానికి కుళ్లిన వేరుశనగ

కూడేరు: మండలంలోని అంతరగంగ గ్రామానికి చెందిన రైతు ఎర్రిస్వామి రెండున్నర ఎకరాల పొలంలో వేరుశనగ పంట సాగు చేశాడు. పంటను కోత కోసి పొలంలో కుప్పలుగా వేశాడు. కాగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వేరుశనగ పంట తడిసి ముద్దయ్యింది. దీంతో వేరుశనగ కట్టె మొత్తం కుళ్లిపోయిందని రైతు వాపోయాడు. దాదాపు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


రైల్వే పాఠశాల ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

గుంతకల్లు, ఆగస్టు18: పట్టణంలోని రైల్వే ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. అదే పాఠశాలలో 1999-2000వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సుమారు 25 ఏళ్ల అనంతరం కలుసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తర్వాత తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు మధుసూదన రావు, రఫీక్, సుధాకర్, రమణరావు, గుప్త, సునీలాపాల్, సాయ్‌రాబాను, సాయికుమారిని సన్మానించారు. అనంతరం రైల్వే వైట్ హౌస్‌లో అందరూ సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థులు షెక్షావలి, అజీం, అజ్మతుల్లా, ఫహీం, గౌస్, రజియా సుల్తానా, సురయ్యా, మీనా తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో పెద్దఎత్తున క్రికెట్ పోటీలు: ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, ఆగస్టు 18: క్రీడాస్ఫూర్తిని చాటేందుకు భవిష్యత్తులో పెద్ద ఎత్తున క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం రాయదుర్గం ప్రీమియం లీగ్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. మ్యాచ్ అనంతరం విజేతగా నిలిచిన ఫ్రెండ్స్ టీంకు రూ. లక్ష, రన్నర్స్‌గా నిలిచిన సౌత్‌టీంకు రూ. 40 వేలు, మూడో స్థానంలో నిలిచిన విజయ లెవెన్స్ టీంకు రూ. 20 వేల చెక్కులను, కప్‌లను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిభావంత క్రీడాకారులను ప్రోత్సహించాలనే సదుద్దేశ్యంతో క్రికెట్ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. వేసవికాలంలో పెద్ద ఎత్తున క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. చేనేత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ టంకశాల హనుమంతు, గార్మెంట్స్ అసోషియేషన్ కార్యదర్శి బాంబే శీను, టీడీపీ నాయకులు గొడిశలపల్లి హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నుంచి ట్రోఫీ అందుకుంటున్న విజేత జట్టు